రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

వార్త

# 111జీవో ఎత్తివేత హర్షణీయం

**-సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌కు ధన్యవాదాలు**

**-రాబోయే రోజుల్లో మినీ హైదరాబాద్‌గా చేవెళ్ల**

**-జీవో ఎత్తివేతపై అవగాహన రహిత్య, అసత్య ప్రచారాలను పట్టించుకోవద్దు**

**-చేవెళ్ల ఎంపీ జి.రంజిత్‌రెడ్డి**



మాట్లాడుతున్న ఎంపీ రంజిత్‌రెడ్డి

**మొయినాబాద్, మే 19. ప్రభాతవార్త :**

మూడు దశాబ్దాలుగా చేవెళ్ల అభివృద్ధికి గుది బండలా ఉన్న 111జీవో ఎత్తి వేయడం హర్షనీయమని, సీఎం కేసీఆర్‌కు, మంత్రి కేటీఆర్‌కు చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు డాక్టర్ రంజిత్‌రెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. మంత్రి కేటీఆర్ ప్రత్యేక చొరవతో రాబోయే రోజుల్లో మినీ హైదరాబాద్‌గా చేవెళ్ల ఆవిర్భవించనుందన్నారు. గురువారం జరిగిన కేబినెట్ సమావేశంలో 111జీవో ఎత్తి వేయడంతో శుక్రవారం మొయినాబాద్‌లోని చౌరస్తాలో బీఆర్ఎస్‌పార్టీ ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు. ఈసందర్భంగా సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. బాణా సంచా కాలి, మిఠాయిలు పంచుకున్నారు. అనంతరం మొయినాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన స్థానిక ఎమ్మెల్యే కాలె యాదయ్యతో కలిసి మాట్లాడుతూ.... మూడు దశాబ్దాల పాటు చేవెళ్ల ప్రాంత వాసులకు గుది బండగా ఉన్న 111జీవో ఎత్తి వేయడంతో సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్, రాష్ట్ర మంత్రి మండలికి ధన్యవాదాలు తెలియజేశారు. నాడు పార్లమెంట్ ఎన్నికల్లో సీఎం కేసీఆర్ ఎంపీగా రంజిత్‌రెడ్డిని గెలిపిస్తే 111జీవో ఎత్తివేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేస్తూ నేడు ఆయన ఇచ్చిన మాట ప్రకారమే జీవో ఎత్తి వేశారన్నారు. జీవో ఎత్తి వేయడంతో ఈ ప్రాంతవాసులు సంతోషంతో మునిగి తేలుతున్నారన్నారు. ఈ ఎత్తివేతతో హెచ్ఎండీఏ పరిధిలో ఏవైతే విధి విధానాలు అమలు అవుతున్నాయో అవే విధానాలు ఇక్కడ అమలు అవుతున్నాయన్నారు. ఇక్కడి నుంచి వచ్చిన ఆదాయంతో ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. నాడు జీవో ఎత్తి వేయ్యాలని కొట్లాడిన ప్రతిపక్షాలు సైతం నేడు సంతోషంతో మాతో కలిసి సంబరాల్లో భాగం అవుతున్నారన్నారు. మూసి నదిని క్లీన్ చేయ్యాడానికి కావాల్సిన చర్యలు ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. 111జీవో ఎత్తివేతతో హైదరాబాద్ నగర అభివృద్ధి ఎక్కడి నుంచి ఆగిందో అక్కడి నుంచే దాదాపు ఒక లక్ష ఎకరాల మేర చేవెళ్ల అభివృద్ధి చెందనుందన్నారు. రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ ప్రత్యేక చొరవతో రాబోయే రోజుల్లో చేవెళ్ల మినీ హైదరాబాద్‌గా అవతరించనుందన్నారు.

# న్యాయం జరిగే వరకు పోరాడతాం

**షాబాద్, మే 19. ప్రభాతవార్త :**

న్యాయం జరిగే వరకు పోరాడుతామని చందన్‌వెల్లి భూనిర్వాసితులు తెలిపారు. భూపరిహారం కోసం చందన్‌వెల్లి భూనిర్వాసితులు కొన్ని నెలలుగా ధర్నాలు, నిరసనలు చేస్తున్న ఎవరు పట్టించుకోవడం లేదని శుక్రవారం చందన్‌వెల్లి గ్రామానికి చెందిన వడ్ల భాగ్యమ్మ తనకు రావల్సిన 3ఎకరాల భూమి డబ్బులు రాలేదని పెట్రోల్ పోసుకోవడానికి వెళ్లడంతో వెంటనే పోలీసులు వచ్చి ఆమెకు నచ్చజెప్పారు. ఇప్పటికైన అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి అర్హులైన రైతులకు నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. తమకు న్యాయం జరిగే వరకు పోరాడుతామన్నారు. ఈకార్యక్రమంలో భూనిర్వాసితుల సంఘం అధ్యక్షుడు నీరటి ఆంజనేయులు, ఉపాధ్యక్షులు నర్సింలు, కార్యదర్శి అనంతం, రైతులు రాంబాబుగౌడ్, ఎల్లష్, సాజిద్, ఫరీద్, భాగ్యమ్మ, నర్సింగ్‌రావు, జరినబేగం, పుష్పమ్మ, మల్లేష్, చిన్నయ్య, శివ, జంగయ్య తదితరులు ఉన్నారు.

# రైతులకు మంచి సేవలు అందించాలి

**-జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి**



**ప్రభాతవార్త వికారాబాద్ జిల్లా ప్రతినిధి :**

రైతులకు మంచి సేవలు అందిస్తే వారి ఆశీర్వాదం పొందుతురాని జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి అధికారులకు సూచించారు. శుక్రవారం మోమిన్‌పేట్ మండలం కస్లాబాద్,రాళ్లగుడు పల్లిలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను కలెక్టర్ ఆకస్మీకంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ... చెరువుల్లో ఉన్న నీరు వృద్ధా కాకుండా రైతులకు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు.చెరువు కట్టలకు సంబంధించిన మరమ్మత్తు పనులను,పూడికతీత పనులను నెలాఖరులోపు పూర్తి కావాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.కాలువల పూడికతీత పనులు, పొదల తొలగింపుతో పాటు కాలువలు శుభ్రంగా ఉండేలా ప్రతిరోజు అధికారులు సమన్వయంతో పనిచేస్తూ క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి పనులు వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.జాతీయ ఉపాధి హామీ పనులు చేపడుతున్న వారికి ఎక్కువ కూలీ వచ్చేలా పనులు చేపట్టి వారి ఆర్థిక అభివృద్ధికి దోహదపడేలా చూడాలని అధికారులకు తెలిపారు.ఉపాధి హామీ కూలీలతో జిల్లా కలెక్టర్ ఆప్యాయంగా పలకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.అదేవిధంగా కూలీల పనితీరును కలెక్టర్ అభినందించారు.కస్లాబాద్ కాలువకు లీకేజ్ ద్వారా వస్తున్న నీటిని అరికట్టి పూడికతీత,పొదల తొలగింపు పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు.అధికారులు విదుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు.మోమిన్ పేట మండల కేంద్రంలోని పల్లె ప్రకృతి వనమును కలెక్టర్ సందర్శించి నిర్వాహన పట్ల సంతృప్తిని వ్యక్తం చేశారు.అనంతరం జిల్లా కలెక్టర్, తహసీల్దారు,మండల అభివృద్ధి అధికారి కార్యాలయాలను సందర్శించారు.తహసీల్దార్ కార్యాలయంలో ఓటరు జాబితాల ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్ ఎన్నికలకు ఓటర్ జాబితా ఎంతో ప్రాధాన్యతను కలిగి ఉంటుందని అది గుండెకాయ లాంటిదని తెలిపారు.ఓటర్ జాబితాలో మార్పులు చేర్పులు చేసే క్రమంలో చాలా జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు.కార్యాలయాల ఆవరణలో ఆహ్లాదకరంగా,పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు కలెక్టర్ సూచించారు.కలెక్టర్ పర్యటనలో డిఆర్‌డిఓ కృష్ణన్,తహసీల్దార్ కిరణ్ కుమార్,ఎంపిడివో శైలజా రెడ్డి,డిఎల్పిఓ అనిత,ఎంపివో యాదగిరి,ఏపిఓ శంకర్,ఏపిఎం రాజు,ఇరిగేషన్ ఏఈ వరప్రసాద్,పంచాయతీ కార్యదర్శి అన్నపూర్ణ ,సర్పంచ్, సావిత్రమ్మలు ఉన్నారు.

# ప్రజలకు ఇబ్బందికరంగా ఉండే పోలీసుస్టేషన్ మాకొద్దు

**-కందుకూరు పరిధిలోని గ్రామాలను పాత పోలీస్ స్టేషన్‌లోనే కొనసాగించాలని వినతి**



రాచకొండ సిపి చౌహాన్‌కు వినతి పత్రం ఇస్తున్న కందుకూరు మండల నాయకులు

**కందుకూరు, మే 19, ప్రభాతవార్త:**

కందుకూరు మండల పరిధిలోని మీర్ఖాన్‌పేట, అకులమైలారం, బేగరికంచ, సార్లరావులపల్లి, ముచ్చర్ల, సాయిరెడ్డిగూడ, గ్రామ పంచాయతీల పరిధి గ్రామాలను కొత్తగా ఏర్పాటు చేస్తున్న హైద్రాబాద్ గ్రీన్ ఫార్మా పోలీస్టేషన్ పరిదిలోకి తీసుకోవడం ఆ పోలీసుస్టేషన్ యాచారం మండలం మేడిపల్లి గ్రామంలో ఏర్పాటు చేయడం వలన ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కోవలసి వస్తుందని ఈ విషయాన్ని పరిగణలోకి తీసుకుని ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరుతు శుక్రవారం మండల జెడ్పిటిసి బొక్క జంగారెడ్డి, మహేశ్వరం మార్కెట్ కమిటి చేర్మెన్ యస్ సురేందర్‌రెడ్డి నాయకత్వంలో ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు నాయకులు రాచకొండ సిపి డిఎస్ చౌహాన్‌ను కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కందుకూరు మండల పరిధిలోని ఆయా గ్రామాల ప్రజలు మేడిపల్లి గ్రామానికి వెళ్లలంటే సుమారు 30 నుండి 40 కిలోమీటర్ల దూరం ప్రయానం చేయవలసి ఉం టుందని సుమారు మూడు బస్సులను మారవలసి ఉంటుందన్నారు. ఆయా గ్రామాలనుండి సరైన రవానా సౌకర్యాలు లేవని సామాన్యుడు ఏదైనా పిర్యాదు చేయాలనుకుంటే ఎంతో వ్యయ ప్రయాసలను ఎదుర్కొ వలసి ఉంటుందని వారు పేర్కొన్నారు. పరిపాలనా సౌలభ్యం కోసం ప్రజ లకు పాలన అందుబాటులో ఉండాని ప్రభుత్వం అలోచన చేస్తుంటే మేడి పల్లి గ్రామంలో కొత్తగా ఏర్పాటు చేయబోయే హైద్రాబాద్ గ్రీన్ ఫార్మా పోలీసుస్టేషన్ వలన కందుకూరు మండలంలోని మీర్ఖాన్‌పేట, అకులమైలారం, బేగరికంచ, సార్లరావులపల్లి, ముచ్చర్ల, సాయిరెడ్డిగూడ గ్రామపంచాయతీల పరిదిలోని గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడవలసి వస్తుందని ఈ విశయాన్ని గమనించి కందుకూరు మండల పరిదిలోని అయా గ్రామాలను పాతపద్దతిలో కందుకూరు మండలంలోని పోలీసుస్టేషన్ లోనే కొనసాగించాలని దానివలన కందుకూరు డిబిజన్ పరిదిలోని అన్ని కార్యాలయాలతోపాటు పోలీస్టేషన్ సౌలబ్యంగా ఉంటుందని వారు పేర్కోన్నారు. లేదంటే కొత్తగా ఏర్పాటు చేయదలచిన హైద్రాబాద్ గ్రీన్ ఫార్మా పోలీస్టేషన్‌ను మేడిపల్లి గ్రామంలో కాకుండా ఫార్మా సిటిలోని అన్ని గ్రామాలకు కేంద్రంగా ఉండే మీర్ఖాన్‌పేట గ్రామంలో ఏర్పాటు చేయడం వలన అన్ని ప్రాంతాల ప్రజలకు అనువుగా ఉంటుందని వారు సిపికి సూచించారు. ఈ విషయంలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని అయా గ్రామాల ప్రజా ప్రతినిదులు నాయకులు సిపి చౌహాన్‌కు విన్నవించారు. ఈ సందర్బంగా రాచకొండ సిపి డిఎస్ చౌహాన్ స్పందిస్తు ఈ విషయాన్ని పరిశీలించి ప్రజలకు ఉపయోగకరంగా ఉండే విదంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని అయా గ్రామాల ప్రజా ప్రతినిదులకు హామిఇచ్చినట్లు నాయకులు ప్రజా ప్రతినిదులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి బొక్క జంగారెడ్డి, ఎఎంసి చేర్మెన్ యస్ సురేందర్‌రెడ్డి తోపాటు కందుకూరు పిఎసిఎస్ చేర్మెన్ డి చంద్రశేఖర్, సర్పంచులు ఇ రాంచంద్రారెడ్డి, ఎంపిటిసి కాకిరాములు, ఆయా గ్రామాల నాయకులు జి లక్ష్మినర్సింహ్మారెడ్డి, జి రాజు, బి చంద్రశేఖర్, డిల్లి పాండు, ప్రవీన్‌నాయక్, సత్తయ్య, వెంకటయ్య పాల్గొన్నారు.

# జిల్లా కలెక్టర్‌ను కలిసిన బిజెపి నాయకులు

**-కీసర జిపి నిధుల అవతవకలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి**



మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో కీసర గ్రామపంచాయతీ నిధుల దుర్వినియోగం విషయంపై కలెక్టర్ అమోయ్‌కుమార్‌కు వినతిపత్రంను అందజేసిన జిల్లా బిజెపి నాయకుల దృశ్యం

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి మే 19, ప్రభాతవార్త**

మేడ్చల్ జిల్లా పరిధిలోని కీసర గ్రామపంచాయతీ నిధులలో అవతవకలు జరిగాయన్న విషయంపై విచారణ జరిపించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పలు సార్లు ప్రజావాణిలో ఫిర్యాదులు చేసినట్లు, ఈ విషయంపై చర్యలు తీసుకోవాలంటూ జిల్లా కలెక్టర్ అమోయ్‌కుమార్‌ను మేడ్చల్ జిల్లా బిజెపి నాయకుల బృందం కలిసి కోరుతూ వినతి పత్రంను అందజేసింది. శుక్రవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్‌ను జిల్లా బిజెపి నాయకులు కలిసి కీసర గ్రామపంచాయతీ నిధుల విషయంపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రంను వారు అందజేశారు. ప్రజాధనం నిధులు దుర్వినియోగం జరిగాయన్న అభియోగంపై విచారణ జరిపించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరటం జరిగిందని పలువురు బిజెపి నాయకులు పేర్కొన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో మేడ్చల్ జిల్లా బిజెపి అధ్యక్షులు పి.విక్రమ్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి జిల్లాల తిరుమలరెడ్డి,ఎంపిటిసి సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి, జిల్లా కిసాన్‌మోర్చ అధ్యక్షులు కొలిచెలిమి కృష్ణ, మండల ప్రధాన కార్యదర్శి కొల బాల్‌రాజ్‌యాదవ్, బిజెవైఎం జిల్లా ఉపాధ్యక్షులు నల్ల వెంకట్‌రెడ్డి, గ్రామ బిజెపి అధ్యక్షులు బండారు శ్రీనివాస్‌రెడ్డిలు జిల్లా కలెక్టరేట్‌కు విచ్చేసి జిల్లా కలెక్టర్ అమోయ్‌కుమార్‌ను ఛాంబర్‌లో కలిసి కోరటం జరిగిందని బిజెపి నాయకులు పేర్కొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా చల్ల నర్సింహారెడ్డి

**-2వ సారి జిల్లా అధ్యక్షులుగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా టీపీసీసీ అధ్యక్షుడిని కలిన నర్సింహారెడ్డి**

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, హైదరాబాద్, మే 19, (ప్రభాతవార్త) :**

రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా చల్లా నర్సింహ్మారెడ్డి నియమితులయ్యారు. శుక్రవారం రెండవ సారి అధ్యక్ష పదవి చేపట్టడంతో టీపీసీసీ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ జనరల్ సెక్రటరీలు వీర్లపల్లి శంకర్, బొర్ర జ్ఞానేశ్వర్ ముదిరాజ్, రాష్ట్ర అధికార ప్రతినిధి సంకెపల్లి సుదీర్‌రెడ్డి, ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, చిల్క మధుసూదన్‌రెడ్డి, పీసీసీ సెక్రెటరీ అమరేందర్‌రెడ్డి,, మాజీ జడ్పీ ఫ్లోర్ లీడర్ ఏనుగు జంగారెడ్డి, చేవేళ్ల పామేనా బీమ్ భరత్, సున్నపు వసంతం, జిల్లా ఉపాధ్యక్షుడు దేవగోని కృష్ణ, జిల్లా జనరల్ సెక్రటరీ ఎరుకల వెంకటేష్‌గౌడ్, మీర్పేట్ కార్పోరేటర్లు చల్లా బాల్‌రెడ్డి, సిద్దాల శ్రీశైలం, మాజీ పీసీసీ సెక్రెటరీ దండెం రాంరెడ్డి, చేవేళ్ల సమన్వయ కమిటీ ఛైర్మన్ సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని సన్మానిస్తున్న చల్లా నర్సింహ్మారెడ్డి, తదితరులు

# కమలం పార్టీ ఖతమే..

**-కర్ణాటక ఫలితాలే..తెలంగాణలో పునరావృతం -మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్**



ఈద్ మిలాప్ కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్

**వికారాబాద్, మే 19, ప్రభాతవార్త:**

రానున్న ఎన్నికల్లో కేంద్రంలోనూ..రాష్ట్రంలోనూ కమలం పార్టీ ఖతం కావడం ఖాయమని, కర్ణాటక ఎన్నికల ఫలితాలే తెలంగా ణలో సైతం పునరావృతం అవుతాయని మాజీ మంత్రి గడ్డం ప్రసాదీకుమార్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని సత్యభారతి ఫంక్షన్ హాల్లో మైనార్టీ నాయకులు, మజీద్ కమిటీ నాయకులు ఈద్ మిలా ప్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి ప్రసాద్‌కుమార్ ముఖ్యతిథిగా హాజరై ప్రసంగించారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం బ్యాంకులు దోచుకున్న బడా బాబులకు అండగా ఉండి దేశాన్ని లూటీ చేసిందని విమర్శించారు. బీజేపీ ప్రభుత్వం చేస్తున్న కార్యకలాపాలు ప్రజలు గమనిస్తున్నారని, వాటి ఫలితమే కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి తగిన గుణపాఠం చెప్పారని గుర్తు చేశారు. తెలంగాణలో సైతం దొరల పాలన కొనసాగుతుందని, దొరల పాలనకు చరమ గీతం పాడే రోజులు దగ్గరపడ్డా యని ఉద్ఘాటించారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో సై తం కర్ణాటకలో వచ్చిన ఫలితాలే పునరావృతం అవుతాయని ధీమా వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికల్లో మైనార్టీ సోదరులు తనను ఆశీర్వదించాలని ఆయన కోరారు. గతంలో కాంగ్రెస్ పార్టీ అధికారం లో ఉన్నప్పుడు మైనార్టీల సంక్షేమానికి అనేక రకాలుగా కృషి చేయడం జరిగిందని గుర్తు చేశారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఊహించని రీతిలో మరింత అభివృద్ధి చేసి చూపిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రఘువీరారెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి, పూడూరు పీఏసీఎస్ ఛైర్మన్ సతీష్‌రెడ్డి, వికారాబాద్ మండల పార్టీ అధ్యక్షులు రాజశేఖర్‌రెడ్డి, మున్సిపల్ మాజీ ఛైర్మన్ సత్యనారాయ ణ,మర్పల్లి మాజీ ఎంపీపీ నర్సిములు, సీనీయర్ నాయకులు రత్నారెడ్డి, కిషన్‌నాయక్, అనంత్‌రెడ్డి, చామల రఘుపతిరెడ్డి, తస్వర్‌అలీ, వాహెద్‌మియా, అయ్యూబ్ అన్సారీ, జాఫర్, చాపల శ్రీనివాస్ పాల్గొన్నారు.

# ఫుడ్ ప్రాసెసింగ్ మిషనరీ ప్రదర్శన



లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేస్తున్న అధికారులు

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, హైదరాబాద్, మే 19, (ప్రభాతవార్త) :**

రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ కార్యాలయం సమావేశ మందిరంలో శుక్రవారం హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, వికారాబాద్ నాలుగు జిల్లాలకు సంబంధించి ఫుడ్ ప్రాసెసింగ్ మిషనరీ ప్రదర్శన జరిగింది. ఈ కార్యక్రమానికి రంగారెడ్డి జిల్లా ఛైర్ పర్సన్ అనితా హరినాథ్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై జిల్లా అదనపు కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఛైర్ పర్సన్ మాట్లాడుతూ... మహిళలు వంటింటి నుంచి మొదలై వంటింటికి కావాల్సిన కారం, పసుపు, మసాలా వంటి ఇతర వస్తువులు తయారు చేసి పారిశ్రామిక వేత్తలు కావచ్చన్నారు. మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల స్థాపన కోసం ప్రభుత్వాలు వివిధ పథకాలు కింద అందిస్తున్న తోడ్పాటుతో ఆర్థిక అభివృద్ధి చెందవచ్చని తెలిపారు. అదేవిధంగా అదనపు కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ... భారత దేశాన్ని వ్యవసాయ రంగ దేశమని అంటారు. రైతులు ఆగ్రో బేస్ వస్తువులను తయారు చేసి ఆర్థికంగా ఎదగవచ్చని తెలిపారు. కలెక్టరేట్‌లో మహిళా సమాఖ్య గ్రూపులకు కూరగాయలు, పండ్లు అమ్ముటకు స్థలం కేటాయించడం జరిగిందని, అదేవిధంగా పోచంపల్లి చేనేత వస్త్రాలు విక్రయించుటకు, చిరు ధాన్యాలు అమ్ముటకు స్థలం కేటాయించడం జరుగుతుందని తెలిపారు. జిల్లా పరిశ్రమల అధికారి రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ... జిల్లాలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను నెలకోల్పేందుకు అనేక అవకాశాలు ఉన్నాయన్నారు. బ్యాంకుల నుంచి సబ్సిడీతో కూడిన రుణ సదుపాయం పొందేందుకు, సూక్ష్మ పరిశ్రమల స్థాపన, కోసం ఉపయుక్తంగా నిలిచే ఆధునాతన యంత్ర పరికరాల గురించి ఈ ప్రదర్శనలో ప్రయోగాత్మంగా వివరించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్, వికారాబాద్ జిల్లాల పరిశ్రమల మేనేజర్లు పవన్, వినయ్‌కుమార్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి ప్రబాకర్, పీడీ మెప్మా అహ్మద్ సఫీవుల్లా, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి గీతారెడ్డి, ఉద్యానవన శాఖ అధికారి సునంద రాణి, జిల్లా అధికారులు, మహిళా సమాఖ్య గ్రూపుల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# జాతీయస్థాయి స్కాలర్‌షిప్‌లు సాధించిన విద్యార్థులు

**కందుకూరు, మే 19, ప్రభాతవార్త:** ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు జాతీయస్థాయి స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) లకు కందుకూరు మండలంలోని తిమ్మాపురం, రాచులూరు, మీర్ఖాన్‌పేట, నేదునూరు టిఎస్ఎంఎస్ పాఠశాలలకు చెందిన 7 మంది విద్యార్థులు ఎంపికైనట్లు ప్రభుత్వం ప్రకటన జారీ చేసింది. తిమ్మాపురం గ్రామానికి చెందిన వట్నాల మౌనిక, కేతావత్ జశ్వంత్, కటికల నవ్యశ్రీ, రాచులూరు పాఠశాలకు చెందిన తిర్మగల్ల ప్రణవి, దాడె విఘ్నేష్, మీర్ఖాన్‌పేట పాఠశాలకు చెందిన నీలం కావ్యనందిని, నేదునూరు టిఎస్ఎంఎస్‌కు చెందిన లంకల అక్షర వేగనలు ఎంపికైనారు. వీరికి నాలుగు సంవత్సరాల కాలం ప్రతి యేడాదికి రూ 12 వేల రూపాయల చొప్పున స్కాలర్‌షిప్ అందించడం జరుగుతుందని అయా గ్రామాల ప్రధానోపాధ్యాయులు తెలిపారు. విద్యార్థులకు ఈ స్కాలర్ షిప్‌లు ఇవ్వడం వలన వారికి ప్రోత్సాహకరంగా ఉంటుందని వారు తెలిపారు. సాటి విద్యార్థులు సాదించిన ఈ అవకాశాన్ని స్పూర్తిగా తీసుకుని సాటి విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రాబోయే కాలంలో స్కాలర్‌షిప్ సాదించేవిదంగా ముందుకు సాగాలని ఉపాద్యాయులు విద్యార్థులకు సూచించారు.

# అక్రమ మద్యం బాటిళ్ల పట్టివేత

**-కారు, ఫోన్‌తో పాటు మూడున్నర లక్షల సొత్తు స్వాధీనం**

**-నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలింపు**

**ఘట్‌కేసర్ రూరల్, మే 19, ప్రభాతవార్త:**

కారులో అక్రమ మద్యం తరలిస్తుండగా ఎక్సైజ్ పోలీసులు వాహనాల తనిఖీ సందర్భంగా ఇతర రాష్ట్రానికి చెందిన 130 మద్యం బాటిళ్లను పట్టుకున్న సంఘటన ఘట్‌కేసర్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.అక్రమ మద్యం తరలింపుకు కారణమైన ముగ్గురి నిందితులపై కేసు నమోదు చేసి ఒకరిని అరెస్టు చేసి కోర్టుకు రిమాండ్‌కు తరలించినట్లు ఎక్సైజ్ పోలీసులు శుక్రవారం నారపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.ఘట్‌కేసర్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ సీఐ మల్లయ్య కథనం ప్రకారం సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. ఘట్‌కేసర్ ఎక్సైజ్ పోలీసులు తమ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కాప్రా ఏరియా పరిధిలోని జాన్ బాప్టిస్ట్ సమిపంలోని అరుల్ కాలనీలో వాహనాలు తనిఖీ చేస్తుండగా అటుగా వస్తున్న ఆల్టో కారు ( నెంబరు ఎపి 20 ఎల్ 8339 )ను ఆపి తనిఖీ చేయగా అందులో నుండి హర్యానాకు చెందిన 45 జానీ వాకర్ రెడ్ లేబుల్ స్కాచ్ వీస్కి ( 750 ) బాటిల్ లభ్యమైనట్లు పోలీసులు తెలిపారు. లభ్యమైన బాటిల్స్‌ను స్వాధీనం చేసుకుని కారు డ్రైవర్ అయిన జంగా లక్ష్మారెడ్డి ( 43 )ని అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా అల్వాల్‌లోని మారుతి నగర్ రోడ్డు నెంబరు 5 లో గల ఇంటిలో మరో 85 మద్యం బాటిళ్లు లభ్యమైనట్లు పోలీసులు తెలిపారు. లభ్యమైన బాటిళ్లు అన్ని జానీ వాకర్ రెడ్‌లేబుల్ స్కాచ్ వీస్కి 750 ఎంఎల్ బాటిళ్లుగా పోలీసులు తెలిపారు. పట్టుబడిన నిందితుడి నుండి సామ్‌సంగ్ ఫోన్‌తో పాటు ఆల్టోకారును స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితుడు జంగా లక్ష్మారెడ్డిది వరంగల్ జిల్లాలోని నర్మెట్ట మండలం, వెల్దండ గ్రామ వాసి కాగా నగరంలోని అల్వాల్‌లో నివాసం ఉంటున్నట్లు పోలీసులు తెలిపారు. పట్టుబడిన మద్యం బాటిళ్లను నిందితుడు జంగా లక్ష్మారెడ్డి, తాటి శ్రీకాంత్, నాగరాజు అనే వ్యక్తుల నుండి కొనుగోలు చేసినట్లు పోలీసుల విచారణలో తెలిపినట్లు పేర్కొన్నారు. పట్టుబడిన మద్యం బాటిళ్లు హర్యానా రాష్ట్రానికి చెందినవిగా పోలీసులు తెలిపారు. నిందితుడి వద్ద నుండి స్వాధీనం చేసుకున్న సొత్తు విలువ దాదాపు మూడున్నర లక్షల వరకు ఉంటుందని తెలిపారు. ప్రధాన నిందితుడు అయినటువంటి జంగా లక్ష్మారెడ్డిపై కేసు నమోదు చేసి కోర్టుకు రిమాండ్ చేసినట్లు తెలిపారు. మరో ఇద్దరు నిందితులు తాటి శ్రీకాంత్, నాగరాజులు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. విలేకరుల సమావేశంలో జిల్లా అసిస్టెంట్ ఎక్సైజ్ ఆఫీసర్ ముకుంద్ రెడ్డి, ఘట్‌కేసర్ ఎస్‌హెచ్‌వో మల్లయ్య, ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ ఎస్సైలు పురుషోత్తం రెడ్డి, ఆకుల శ్రావణి, ఎక్సైజ్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నట్లు తెలిపారు.



ఘట్‌కేసర్ ఎక్సైజ్ పోలీసులకు పట్టుబడిన అక్రమ మద్యం వివరాలు నారపల్లి పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో వెల్లడిస్తున్న ఎక్సైజ్ పోలీసులు.

## ప్రభుత్వ భూమిలో అక్రమంగా ఇటుక బట్టీలు

**-నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలి**

**- సర్పంచ్ దేవా నాయక్**



**శంషాబాద్ మే 19,ప్రభాతవార్త :** మదనపల్లి కొత్త తండా పరిధిలోని సర్వేనంబర్ 50లో ఉన్న ప్రభుత్వ భూముల్లో అక్రమంగా ఇటు బట్టిలు నిర్వహిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని సర్పంచ్ కొర్ర దేవా నాయక్ అధికారులను కోరారు. జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని అక్రమంగా బట్టిలు నిర్వహిస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని ఇటుక బట్టిలను సీజ్ చేయాలని కోరారు. మనదపల్లి కొత్త తండా పరిధిలో దాదాపు పది ఎకరాల విస్తీర్ణంలో అక్రమంగా ఇటుక బట్టిలను నిర్వహిస్తూ దూర ప్రాంతాల నుండి వలస కార్మికులను తీసుకొని వచ్చి వెట్టిచాకిరి చేయిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఈ బట్టిల వద్ద అనేక మంది బాల కార్మికులు కూడా పని చేస్తున్నారని బాల కార్మికులను పనిలో పెట్టుకున్న ఇటుక బట్టిల నిర్వాహకులు గోపాల్ నాయక్‌లపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గతంలోనే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికి పట్టించుకోకపోవడంతో బట్టీల నిర్వాహకులు మరింత రెచ్చిపోయి అక్రమాలకు పాల్పడుతున్నారని సర్పంచ్ కొర్ర దేవా నాయక్ అధికారులకు సూచించారు.

## పుచ్చలపల్లి సుందరయ్య 38వ వర్ధంతి వేడుకలు



సుందరయ్యకు నివాళులర్పిస్తున్న నాయకులు

**తలకొండపల్లి మే19,ప్రభాతవార్త :** తలకొండపల్లి మండల కేంద్రంలో పుచ్చలపల్లి సుందరయ్య 38వ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన సిపిఎం పార్టీ మండల కార్యదర్శి గుమ్మడి కురుమయ్య మాట్లాడుతూ....తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వీరుడు, స్వాతంత్ర్య సమరయోధుడు తెలుగు నాట కమ్యూనిస్టు పార్టీ ఉద్యమ నిర్మాత నిరాడంబరతో ఆదర్శ జీవితం గడిపిన గొప్ప నాయకుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు కానుగుల వెంకటయ్య, పిప్పళ్ల శివశంకర్, కానుగుల బాలకిష్టయ్య, కార్మికులు కృష్ణారెడ్డి, ఎం.నరసింహ అరుణ్ కుమార్, కల్పన, వి.నరసింహ, రాణి, లక్ష్మి, మంజుల మానస స్వప్న అరుణ ,విజయ భాగ్యలక్ష్మి, అంజలి మాధవి, తదితరులు పాల్గొన్నారు.

## కళాకారులకు ఐక్యత ఫౌండేషన్ విరాళం



కళాకారులకు విరాళం అందజేస్తున్న దృశ్యం

**తలకొండపల్లి మే19,ప్రభాతవార్త :** తలకొండపల్లి మండలంలోని చౌదర్‌పల్లి గ్రామంలో పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి చరిత్ర బయలు నాటకం నిర్వహించారు. ఈ నాటకానికి ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి కళాకారులను ప్రోత్సహిస్తూ అంతరించిపోతున్న కళకు మళ్లీ పూర్వవైభవం తీసుకురావాలనే సదుద్దేశ్యంతో తన ఫౌండేషన్ తరపున కళాకారులకు 10వేల రూపాయలను అందజేశారు ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాలకు ఎల్లప్పుడూ ఐక్యత ఫౌండేషన్ ద్వారా తమ సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నూనె రాఘవేందర్ కాలె మహేష్, డిప్యూటీ సర్పంచ్ బీస శ్రీనివాస్ రెడ్డి, జాజల నరేష్, కాలె శ్రీకాంత్, కాలె అనిల్, గౌరిపల్లి సర్పంచ్ నరేందర్ ,భరత్, మల్లేష్, విజయ్ కుమార్, శ్రీరాంరెడ్డి, మల్లని గోపాల్, తడిసిన వేమారెడ్డి, బీస సాయిరెడ్డి, లాల్కోట నరేందర్ ,తదితరులు పాల్గొన్నారు.

## ఆర్ఆర్ఆర్ కేంద్రాలను ఏర్పాటు చేయాలి




ఆర్ఆర్ఆర్‌పై నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి

**కీసర, మే19, ప్రభాతవార్తః**

ఆర్ఆర్ఆర్ కేంద్రాలను ఏర్పాటు చేసి విజయవంతం చేయాలని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. "మేరా లైఫ్ మేరా స్వచ్ఛ్ షెహర్"లో భాగంగా ఆర్ఆర్ఆర్ కేంద్రాల ఏర్పాటు, వాటి వినియోగం గురించి వార్డు అధికారులకు, ఆర్‌పిలకు, సూపరవైజర్‌లకు శుక్రవారం సమావేశాన్ని మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ఈ నెల 20వ తేదీ నుండి ఏప్రిల్ 5వ తేదీ వరకు ఉన్నందున వార్డుల వారిగా ఆర్ఆర్ఆర్ కేంద్రాలను ఏర్పాటు చేసి వాటి యొక్క వినియోగం గురించి ప్రజలకు అవగాహన కల్పించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ప్రజలందరూ తమ ఇళ్లలోని వాడబడిన, పనికిరాని పొడి వస్తువులను ఆర్ఆర్ఆర్ కేంద్రాల వద్ద ఇవ్వాలని కోరారు. అదే విదంగా వీటి వినియోగం గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని కమీషనర్ వాణిరెడ్డి తెలియజేశారు. ఈ 15 రోజుల కార్యక్రమంలో పొడి చెత్తకు సంబందించిన అన్ని రకాల ప్లాస్టిక్ వస్తువులు, వినియోగంలో లేని దుస్తులు, షాంపూ కవర్ల నుండి పుస్తకం వరకు వస్తువులన్ని ఆర్ఆర్ఆర్ వద్ద ఇవ్వవచ్చని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మేనేజర్ చంద్రశేఖర్, సానిటరీ ఇన్స్‌పెక్టర్ రాంరెడ్డి, ఎన్విరాన్ మెంటల్ ఇంజనీర్ ప్రశాంత్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## క్లినిక్‌లను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

**మేడ్చల్ మే19,ప్రభాతవార్త :** రైతులకు న్యాయ సేవలు అందించేందుకు అగ్రి లీగల్ ఎయిడ్ క్లినిక్‌లు దోహద పడతాయని మేడ్చల్ కోర్ట్ సీనియర్ సివిల్ జడ్జి అజయ్ కుమార్ జాదవ్ అన్నారు. శుక్రవారం మేడ్చల్ మండలంలోని పూడూరు మరియు రైలాపూర్ గ్రామంలోని రైతు వేదికల్లో ఏర్పాటు చేసిన అగ్రి లీగల్ ఎయిడ్ క్లినిక్‌లను ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ కేంద్రాల ద్వారా రైతులు వ్యవసాయానికి సంబంధించి ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం పొందుతారని అన్నారు. రైతులు ఈ క్లినిక్‌లను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



# 111జీవో ఎత్తివేతపై హర్షాతిరేకలు

**-కెసిఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్**

**శంషాబాద్ మే19,ప్రభాతవార్త :**

రంగారెడ్డి జిల్లా పరిధిలోని 84 గ్రామాల పాలిట శాపంగా మారిన ట్రిబుల్ వన్ జీవోను ఎత్తివేస్తూ రాష్ట్ర క్యాబినెట్ తీసుకున్న నిర్ణయంపై హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ అన్నారు. శంషాబాద్ మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు పొడిగంటి చంద్రారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి కెసిఆర్ చిత్రపటానికి ప్రకాష్ గౌడ్ పాలాభిషేకం చేశారు. 1996లో అప్పటి ప్రభుత్వం తీసుకువచ్చిన ఈ జివో కారణంగా రాజేంద్రనగర్, మొయినాబాద్, చేవెళ్ల ,షాద్‌నగర్ నియోజకవర్గంలోని కొంత భాగం రైతులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారని తెలిపారు. రైతుల సమస్యలు తెలుసుకున్న తాము ముఖ్యమంత్రి కెసిఆర్ దృష్టికి తీసుకువెళ్లి ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని పలుసార్లు కోరిన మీదట ఆయన సాహసోపేతమైన నిర్ణయం తీసుకొని ట్రిబుల్ వన్ జీవోను పూర్తిగా ఎత్తివేస్తున్నట్లు మంత్రివర్గంలో తీర్మానం చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. 84 గ్రామల ప్రజల ఆర్థిక స్థితిగతులపై ఈ జీవో ప్రభావం ఎంతో ఉంటుందని ఇకపై ఈ గ్రామాల ప్రజలు ఆర్థికంగా మరింత ముందుకు దూసుకెళ్లే అవకాశం లభిస్తుందని అన్నారు. ముఖ్యమంత్రి కెసిఆర్‌కు ఆయ న కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ చొరవ తీసుకొని జీవోను రద్దు చేయించారని ఈ ఘనత ప్రకాష్ గౌడ్ ముఖ్యమంత్రి కెసిఆర్‌కు దక్కుతుందని మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కొడిగంటి చంద్రారెడ్డి అన్నారు. ఈ ప్రాంత ప్రజలు వీరిని జీవితాంతం, గుర్తుంచుకుంటారని తెలిపారు. ఈ కార్యక్ర మంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కొలను సుష్మామహేందర్ రెడ్డి, వైస్ చైర్మన్ బండి గోపాల్ యాదవ్, మండల జడ్పిటిసి నీరటి తన్విరాజు ముదిరాజ్ ,ఎంపిపి జయమ్మ శ్రీనివాస్, పార్టీ సీనియర్ నాయకులు రాజు ముదిరాజ్ ,మహేందర్ రెడ్డి, కౌన్సిలర్లు చెన్నం అశోక్, మేకల వెంకటేష్, సర్పంచ్‌లు మాధవియా దగిరి రెడ్డి, వట్టెల సతీష్ యాదవ్, దేవరకొండ రమేష్ యాదవ్, దేవిక జగన్ గౌడ్, ఎంపిటిసి పూసలపాటి యాదయ్య, సీనియర్ నాయకులు జిట్టే సిద్దులు, పోరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, పోరెట్టి, చంద్రశేఖర్ రెడ్డి, సత్యానందం శ్రీకాంత్ యాదవ్, శ్రీకాంత్ రెడ్డి, దవణాకర్ గౌడ్, దేవులపల్లి శ్రీనివాస్ ,శ్రీకాంత్ గౌడ్, కొనమొల్ల శ్రీనివాస, తోట రాములు, తోట విట్టల్, తదితరులు పాల్గొన్నారు.



కెసిఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్, నాయకులు

# నకిలీ విత్తనాలు,ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు

**-ఫర్టిలైజర్ షాపుల్లో ఎస్సై రవిగౌడ్ తనిఖీలు**

**కొడంగల్, మే 19ప్రభాతవార్త**

నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు విక్రయిస్తే పీడీ కేసుల నమోదుతో కఠిన చర్యలు తప్పవని ఎస్సై రవిగౌడ్ అన్నారు. జిల్లా ఎస్పీ ఎన్.కోటిరెడ్డి (ఐపీఎస్) ఆదేశాల మేరకు శుక్రవారం కొడంగల్ పట్టణంలోని వైష్ణవి, రాఘవేంద్ర, ఓంట్రేడింగ్ తదితర ఫర్టిలేజర్ షాపుల్లో వ్యవసాయాధికారి బాలాజీతో కలసి తనిఖీలు నిర్వహించారు. పలు రకాల విత్తనాలు, ఎరువుల ధరలు, బిల్లులు తదితర వాటిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతు నకిలీ విత్_నాలపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తున్నదని, ఎక్కడైనా నాసిరకం విత్తనాలను రైతులకు అంటగడితే ఉపేక్షించేది లేదన్నారు. రానున్న వర్షాకాలం పంటల సాగుకు అవసర పడే విత్తనాలు, ఎరువులు, పురుగుల మందుల కొనుగోలుకు సంభందించిన బిల్లులను విధిగా రైతులకు అందించాలని సూచించారు. విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులకు సంభందించి కొనుగోలు చేసిన వాటికి సంభందించిన బిల్లులను రైతులు విధిగా తీసుకోవాలన్నారు. అలాగే బిల్లులు ఉంటే పంటనష్టం వాటిల్లిన పక్షం లో భీమా వర్తిసుందన్నారు. ఇందుకుగాను రైతులు లైసెన్స్ ఉన్న ఫర్టిలేజర్ దుకా ణాల్లోనే నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఈ ఓ, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఫర్టిలేజర్ దుకాణంలో తనిఖీలు చేస్తున్న ఎస్సై తదితరులు

# ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి చొరవతో తొలగిన సమస్యలు



ధాన్యం కొనుగోలులో ఇబ్బందులను ఎమ్మెల్యేకు వివరిస్తున్న రైతులు

**కొడంగల్, మే 19ప్రభాతవార్త**

ధాన్యం విక్రయాల్లో నెలకొన్న సమస్యలు ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి చొరవతో తొలగిపోయినట్లు రైతులు హర్షం వ్యక్తం చేశారు. కొడంగల్ పట్టణంలోని మార్కెట్ యార్డులో గతకొన్ని రోజులుగా ధాన్యం విక్రయాల్లో సమస్యలు ఏర్పడడంతో శుక్రవారం రైతులు ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అక్కడికి చేరుకొని రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాలకు చెందిన రైతులు మాట్లాడుతు ప్రభుత్వ మద్దతు ధరతో ధాన్యం కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో రైతుల ధాన్యాన్ని చిన్నపాటి కాంటతో తూకం వేస్తుండడంతో రోజుల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొందని రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. అంతేగాక కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు అధికారుల నిర్లక్ష్యం కారణంగా సరిపడా లారీలు అందుబాటులో లేకపోవడంతో నానా అవస్థలు పడుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల సమస్యలను తెలుసుకున్న ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి జిల్లా అధికారులతో ఫోన్లో మాట్లాడి తక్షణమే పెద్ద కాంటతో ధాన్యం తూకం చేయాలని అదేశించారు. అంతేగాక కొనుగోలు చేసిన ధాన్యాన్ని తరలించేందుకు అదనపు లారీలు అందుబాటులో ఉంచాలని ఆదేశించడంతో అధికారుల్లో చలనం రావడంతో పాటు పెద్ద కాంటా ఏర్పాటుతో పాటు అవసరపడే లారీలను అందుబాటులో ఉంచారు. రైతుల సమస్యలు తొలగించడంలో ఎమ్మెల్యే చొరవ చూపడంతో రైతులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్‌చెర్మేన్ భీమలు, మున్సిపల్ కౌన్సిలర్‌లు మధుసుదన్‌యాదవ్, శంకర్‌నాయక్, బీఆర్ఎస్ నాయకు లు టీటీ.రామునాయక్‌లతో పాటు మార్కెట్ కమిటీ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు



ఫర్టిలైజర్ దుకాణాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

**షాబాద్, మే 19. ప్రభాతవార్త :**

విత్తన వ్యాపారులు రైతులకు నకిలి విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అలాగే షాపుల లైసెన్స్‌లను రెన్యువల్ చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి వెంకటేశం తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో ఫర్టిలైజర్ షాపుల్లో విత్తనాల తయారీ కంపెనీ, లాట్ నెంబర్, బ్యాచ్ నెంబర్, స్టాక్ రిజిస్టార్‌లను ఇన్స్పెక్టర్ గురువయ్యగౌడ్, ఎస్సై మహేశ్వర్‌రెడ్డిలతో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.... అధిక దిగుబడులు వస్తాయని, రైతులకు ఆశ చూపి నకిలి విత్తనాలు అమ్మితే చర్యలు తీసుకుంటామన్నారు. ధరల పట్టిక స్టాక్ వివరాలు ఏరోజుకారోజు రాయాలన్నారు. విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు కొనుగోలు చేసిన ప్రతి రైతుకు తప్పనిసరిగా రశీదు ఇవ్వాలన్నారు. రైతులు విత్తనాలు కొనేటప్పుడు రశీదు తప్పకుండా తీసుకుని అవి వాటిని పంటకాలం పూర్తి అయ్యే వరకు జాగ్రత్తగా పెట్టుకోవాలన్నారు.

## తెలంగాణలో రాబోయేది కాంగ్రెస్ పార్టీయే



రేవంత్‌రెడ్డిని కలిసిన వీర్లపల్లి శంకర్

**కొత్తూర్, మే 19, ప్రభాతవార్త :**

తెలంగాణలో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఎగిరేది కాంగ్రెస్ జెండా అని వీరమోని దేవేందర్‌ముదిరాజ్ తెలిపారు. శుక్రవారం కాంగ్రెస్‌పార్టీ టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి తన నివాసంలో కాంగ్రెస్ పార్టీ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్‌తో కలిసి కొత్తూర్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దేవేందర్ మర్యాదపూర్వకంగా కలిశారు. దేవేందర్‌ముదిరాజ్ మాట్లాడుతూ.... తెలంగాణలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి పలు సుదీర్ఘ అంశాలపై చర్చించడం జరిగిందన్నారు. కర్ణాటకలో ప్రజలకు న్యాయం జరిగేది, కాంగ్రెస్ పార్టీ ద్వారానే అని గ్రహించి కాంగ్రెస్ పార్టీని ప్రజలు అధికారంలోకి తీసుకురావడం జరిగిందన్నారు. గతంలో కూడా తెలంగాణలో సామాన్యులకు కాంగ్రెస్ పార్టీ ద్వారానే న్యాయం జరిగిందని గుర్తు చేశారు. సామాన్యులకు న్యాయం కాంగ్రెష్ పార్టీతోనే సాధ్యమవుతుందన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని అధికారం తీసుకురావడానికి ప్రతి కార్యకర్త శక్తివంచనతో పనిచేసే పార్టీ సిద్ధాంతాలను ప్రజలకు తెలియజేసేలా ప్రతి కార్యకర్త ఒక సైనికుల పనిచేయాలని రేవంత్‌రెడ్డితో సుదీర్ఘమైన చర్చలు జరిపామన్నారు.

## విద్యార్థులు క్రమ శిక్షణతో ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలి

**- ప్రిన్సిపాల్ జైపాల్‌రెడ్డి పిలుపు**



చేవెళ్లలోని వివేకానంద జూనియర్ కళాశాల విడ్కోలు సమావేశంలో పాల్గోన్న విద్యార్థులు అద్యపకులు

**చేవెళ్ళ మే 19, ప్రభాతవార్త**

విద్యార్థులు క్రమ శిక్షణతో కూడిన విద్యానభ్యసించి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని వివేకానంద కళాశాల ప్రిన్సిపాల్ జైపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం చేవెళ్ల మండల కేంద్రంలోని వివేకానంద జూనియర్ కళాశాలలో తృతీయ సంవత్సరం విద్యార్థులు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివేకానంద కళాశాల ప్రిన్సిపాల్ జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు విద్యన ఇష్టంతో చదివినప్పుడే ఉన్నత శిఖరాలకుచేరుకుంటారన్నారు. విద్యార్థులు కళాశాల నుండి వెళ్లిన తరువాత కూడ ఇతర కళాశాలలో కూడ క్రమ శిక్షణతో కూడి విద్యను మాత్రమే అభ్యసించాలన్నారు. తమ కళాశాల ఉత్తమ విద్యార్థులను కోల్పోతుందని, ఎక్కడ ఉన్న తమ విద్యార్థులు లక్ష సాధన దిశగా సాగాలన్నారు. భవిష్యత్తులో ఉత్తమ స్ధాయికి చేరుకోవాలన్నారు. విద్యార్థులు చేసిన సాంస్కృతికి కార్యక్రమాలను ఎంతగానే అకట్టుకున్నాయి, ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ సి.ఇంద్రాసేనారెడ్డి, ట్రెజరర్ ప్రభాకర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, అద్యపకులు తదితరులు పాల్గోన్నారు.

## జీఓ 111 ఎత్తివేత హర్షణీయం

**-సిఎం కెసిఆర్, ఎంపి రంజిత్‌రెడ్డికి దన్యవాదాలు : ఎంపిటిసి బక్కరెడ్డి రవీందర్‌రెడ్డి**

**చేవెళ్ళ మే 19, ప్రభాతవార్త :** తెలంగాణ ప్రభుత్వం జీఓ 111ను ఎత్తివేయం హర్షణీయమని, చేవెళ్ల మండలం లోని ప్రజలకు మెలు చేసిన సిఎం కేసిఆర్‌కి, చేవెళ్ల ఎంపి గడ్డం రంజిత్‌రెడ్డికి, చేవెళ్ళ ఎమ్మెల్యే కాలే యాదయ్యకు దన్యవాదాలు తెలుపుతున్నామని చేవెళ్ల మండలం ఎంపిటిసిల ఫోరం అద్యక్షుడు, మల్కాపూర్ ఎంపిటిసి బక్కరెడ్డి రవీందర్‌రెడ్డి అన్నారు. జీఓ ఎత్తివేతతో చేవెళ్ల ప్రాంత ప్రజలకు, రైతులకు ఎంతో మెలు జరగుతుందని, మంత్రి కెటిఆర్ చోరవ తో రాబోయే రోజుల్లో చేవెళ్ల ప్రాంతం మరింతగా అభివృద్ధి చేందుతుందన్నా రు. చేవెళ్ల ప్రాంత అభివృద్ధిపై దృష్టి సారించిన ప్రభుత్వంకు ఋణపడిఉన్నామన్నారు.

## జిల్లెడులో పారిశుద్య పనులు

**జిల్లెడు చౌదరిగూడ, మే 19,(ప్రభాతవార్త):** జిల్లెడు చౌదరిగూడ మండలంలోని జిల్లెడు గ్రామంలో శుక్రవారం పారిశుద్య పనులు చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఆయా కాలనీలలో చెత్త చెదారాన్ని ఎత్తి వేశారు. అలాగె మురుగు కాలువలను శుబ్రం చేసినట్లు సర్పంచ్ బాబురావు తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మెరకు గ్రామంలో పారిశుద్య కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు.



గ్రామంలో పారిశుద్య పనులు చేయిస్తున్న సర్పంచ్ బాబురావు

## సిఎం కెసిఆర్‌కి రుణపడి ఉంటాం



మండల తహశీల్దార్ కార్యాలయం వద్ద సీఎం కేసీఆర్ చిత్ర పటానికి పాలాభిషేకం చేస్తున్న మండల విఆర్ఏలు

**కీసర, మే19, ప్రభాతవార్తః**

సీఎం కేసీఆర్‌కి రుణపడి ఉంటామని మండల విఆర్ఏల సంఘం అధ్యక్షులు ఫకీర అన్నారు. శుక్రవారం తహశీల్దార్ కార్యాలయం వద్ద మండల విఆర్ఏలు సీఎం కేసీఆర్ చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏండ్ల నుంచి విఆర్ఏలుగా పనిచేస్తున్న మమ్మల్ని సీఎం కేసీఆర్ రెగ్యులరైజ్ చేయడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో విఆర్ఏల సం ఘం ఉపాధ్యక్షులు కావలి నారాయణ, జిల్లా కో చైర్మన్ ఈగ శ్రీనివాస్, మండల విఆర్ఏలు అమృత, నరేష్ చిత్తయ్య, మహేశ్, చిత్తారి, బాలరాజు, చెన్నయ్య పాల్గొన్నారు.

## మహాధర్నాను విజయవంతం చేయండి

**-కర్రపత్రం విడుదల చేసిన నాయకులు**



నందిగామలో కరపత్రం విడుదల చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

**నందిగామ మే19, ప్రభాతవార్త :**

లక్ష్మీదేవి పల్లి రిజర్వాయర్‌ని నిర్మాణం చేపట్టాలని కోరుతూ అఖిల పక్షం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 22న చేపట్టనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని నందిగామ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జంగ నర్సింలు యాదవ్, ఎంపిటిసిల సంఘం జిల్లా అధ్యక్షుడు కొమ్ము కృష్ణలు పిలుపునిచ్చారు. మాటలగారడీతో ప్రజలను మభ్యపెట్టే బిఆర్ఎస్‌ను రాబోయే ఎన్నికల్లో బొందపెట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసిలు దేపల్లే కుమార్ స్వామిగౌడ్, చంద్రపాల్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు చాకలి నర్సింహ్మా, వడ్ల రమేష్, ఏపూరి ఆనందం, చిన్నంతరగారి ప్రభు, గ్రామకమిటీ అధ్యక్షుడు పిట్టెల రాములు, తడకల జంగయ్య, శివ్వగల్ల సతీష్, మహేష్, ఆంజనేయులు యాదవ్, పాల్గొన్నారు.

## పారిశుధ్య కార్యక్రమాలపై స్పెషల్ డ్రైవ్



పోచారం మున్సిపల్ అన్నోజిగూడలో పారిశుద్ధ్య కార్యక్రమాలపై స్పెషల్ డ్రైవ్ ప్రారంభిస్తున్న చైర్మన్ బి. కొండల్ రెడ్డి తదితరులు

**ఘట్‌కేసర్ రూరల్, మే 19, ప్రభాతవార్త:**

రానున్న వర్షాకాలంలో రోడ్లపై వరదనీరు నిల్వకుండా మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డుల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలపై స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నట్లు మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి అన్నారు. పోచారం మున్సిపల్ పరిధిలోని అన్నోజిగూడలోని 3,4 వార్డుల్లో చైర్మన్ పర్యటించి పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించారు. మున్సిపల్ పరిధిలోని అన్నోజిగూడ, లక్ష్మీనర్సింహ కాలనీ, ఎల్ఐజీ కాలనీ తదితర చోట్ల పారిశుద్ధ్య పనులు చేపడుతున్నట్లు తెలిపారు. వర్షాకాలంలో రోడ్లపై వర్షపు నీరు నిల్వకుండా ఈ నెల 19 నుండి 27 వరకు అన్ని వార్డుల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. డ్రైనేజీల శుభ్రపరచుట, రోడ్లపై మట్టిని తొలగించుట, వర్షపునీరు పారకుండా అడ్డగా ఉన్న చెత్తచెదారం తొలగించడం, నాలల పూడిక తీత, దోమల నివారణకు చర్యలు, చెత్తను తొలగించడం, అవసరమైన చోట మ్యాన్ హోల్ ఏర్పాటు వంటి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో చైర్మన్‌తో పాటు వైస్ చైర్మన్ నానావత్ రెడ్యానాయక్, కమిషనర్ ఎ. సురేశ్, కౌన్సిలర్ చింతల రాజశేఖర్, ఏఈ. నరేశ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ శివారెడ్డి, నాయకులు నర్రి కాశయ్య, ఎ. బాల్‌రెడ్డి, సురేందర్, మెట్టు రాజు యాదవ్ పాల్గొన్నారు.

## రెండవ రోజు ప్రత్యేక పూజలు



కుమ్మరిగూడలో హోమం నిర్వహిస్తున్న గ్రామస్థులు

**షాబాద్, మే 19. ప్రభాతవార్త :**

మండల పరిధిలోని కుమ్మరిగూడ గ్రామంలో రెండవ రోజు బీరప్ప, మల్లన్న, కామరాతి దేవతల విగ్రహాప్రతిష్ఠాపన, ధ్వజస్థంబ, బొడ్రాయి ప్రతిష్ఠాపన కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం శాంతిసూక్తము, మంటపదే వత, షోడశోపచార పూజలు, మూలమంత్ర జపములు, వాస్తు, నవగ్రహ, యోగిని, క్షేత్రపాలక, హోమము తదితర కార్యక్రమాలు వేదపండితులు కార్యక్రమాలు చేయించారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ పోనమోని కేతన, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామస్థులు తదితరులు ఉన్నారు.

## మాణెమ్మ కుటుంబానికి అండగా ఉంటాం

**షాబాద్, మే 19. ప్రభాతవార్త :**

అనారోగ్యంతో మృతి చెందిన సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ మాణెమ్మ కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని జడ్పీటీసీ పట్నం అవినాష్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని మాచన్‌పల్లి తాండలో ఆమె భౌతికకాయం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించి ఆమె ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించారు. ఆయన వెంట గోపాల్ తదితరులు ఉన్నారు.

## మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య

**తలకొండపల్లి మే19,ప్రభాతవార్త :** తలకొండపల్లి మండల పరిధిలోని జంగారెడ్డిపల్లి గ్రామానికి చెందిన గొర్రె లక్ష్మయ్య ఆత్మహత్య చేసుకున్న సంఘటన వెలుగులోకి వచ్చింది. బాధితుల కుటుంబ సభ్యులు, పోలీసులు వివరాల ప్రకారం...తలకొండపల్లి మండలం జంగారెడ్డిపల్లి గ్రామానికి చెందిన గొర్రె లక్ష్మయ్య (50) అనే వ్యక్తి గత కొంతకాలంగా మద్యానికి బానిస అయ్యాడు. ఈనెల 18న రాత్రి 9 : 30 గంటల సమయంలో కుమారుడు వెంకటేష్‌కు తెలిపి వ్యవసాయ పొలానికి వెళ్తున్నట్లు తెలిపారు. అయిన ఇంటికి తిరిగి రాలేదు శుక్రవారం ఉదయం అతని పొలం సమీపంలో చాకలి వీరేష్ పొలంలో చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఉదయం కుటుంబ సభ్యులు వెళ్లి చూడగా అతడు ఊరేసుకొని మృతి చెందినట్లు నిర్ధారించుకున్నారు. మృతునికి భార్య జయమ్మ కుమారుడు వెంకటేష్, మహేందర్‌లు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ వెంకటేష్ తెలిపారు.

## వీఆర్‌ఏల డిమాండ్‌ల పరిష్కారం పట్ల హర్షం



సీసీఎల్‌లో సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకంలో పాల్గొన్న జేఏసీ జిల్లా కన్వీనర్ గోపాల్

కొడంగల్,మే 19(ప్రభాతవార్త

వీఆర్‌ఏల డిమాండ్‌ల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవడం పట్ల వీఆర్‌ఏల సంఘం జిల్లా కన్వీనర్ గోపాల్ హర్షం వ్యక్తం చేశారు.రాష్ట్ర జేఏసి పిలుపు మేరకు శుక్రవారం హైద్రాబాద్‌లోని సీసీఎల్‌ఏ దగ్గర రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి వీఆర్‌ఏ సంఘం ప్రతినిధులు క్షీరభిషేకం చేశారు.ఈ సందర్భంగా సంఘం జేఏసీ జిల్లా కన్వీనర్ గోపాల్ మాట్లాడుతు వీఆర్‌ఏల డిమాండ్‌లలో ప్రధానంగా ప్రభుత్వం పేస్కేల్ ఇచ్చినందుకుగాను రాష్ట్రంలోని 23వేల వీఆర్‌ఏల కుటుంబాల్లో వెలుగు నింపిందన్నారు.ఇందుకుగాను వీఆర్‌ఏల జేఏసీ పక్షాన సీఎం కేసీఆర్‌కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.అంతకుముందు స్దానిక తహశీల్దార్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి వీఆర్‌ఏలు పాలాభిషేకం నిర్వహించారు.కార్యక్రమంలో వీఆర్‌ఏలు వెంకటయ్య, నర్సింహ,మోహన్,శేఖర్,బాకారం కిష్టయ్య పాల్గొన్నారు.

## ముడిమ్యాల సహకార సంఘంలో జనుములు సబ్సిడీలో తీసుకోండి

**-చేవెళ్ల మండల వ్యవసాయ అధికారి తులసీ సూచన**

చేవెళ్ళ మే 19, ప్రభాతవార్త

వర్షాకాలం ప్రారంభమైన సీజన్‌లో జనుములు 65 శాతం పబ్సిడీపై ముడిమ్యాల సహకార సంఘంలో రైతులు తీసుకోవాలని చేవెళ్ల మండల వ్యవసాయ అధికారి తులసీ సూచించారు. రైతులు తమ పట్టాదారు పాసుపుస్తకాలు, ఆధారు కార్డు, తీసుకుని సంబందిత రైతు వేదికలో వ్యవసాయ విస్తరణ అధికారిని సంప్రదించి అనుమతి తీసుకుని ముడిమ్యాల సొసైటీలో 40 కిలోల జనుముల బస్తాకు 1225 రూపాయలను చెల్లించి తీసుకోవాలన్నారు. ఒక రైతు వేదిక పరిధిలో 40 బస్తాలకు మాత్రమే పర్మిట్‌లు ఇవ్వడంజరుగుతుందని, జనుములు వేసిన రైతులకు సర్వేనంబర్ వారిగా పంటల నమోదు చేయాలన్నారు.చేవెళ్ల రైతు వేదికలో చేవెళ్ల,కేసారం, మల్కాపూర్, ముడిమ్యాల, రావులపల్లి, కుమ్మెర, న్యాలట, దామరిగిద్ద, కందవాడ రైతువేదికలో కందవాడ, గుండాల, అల్లావాడ, పామెన, కమ్మెట రైతువేదికలో కమ్మెట,ఏన్కేపల్లి, ఈర్లపల్లి, గొల్లపల్లి, దేవుని ఎర్రవల్లి, ఊరెళ్ల, ఇబ్రహింపల్లి, ఆలూరు రైతువేదికలో ఆలూరు 1,2,3, తలారం, తంగడ్‌పల్లి, కౌకుంట్ల, హస్తేపూర్, నావులాయపల్లి, ఖానాపూర్ రైతువేదికలో ఖానాపూర్, రేగడిఘణాపూర్, దేవరంపల్లి, చన్‌వల్లి,మిర్జాగూడ, బస్తేపూర్,కిష్టాపూర్, నాంచేరి, అంతారం గ్రామాల రైతులు ఈ నెల 20వ తేది ఉదయం 9 గంటలకు వ్యవసాయ అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు.జనుములు కావాల్సిన రైతులు సబ్సీడిపై ముడిమ్యాల సహకార సంఘంలో తీసుకోవాలని సూచించారు.

## ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు

**-డిప్యూటీ తహసీల్దార్ సురేష్**



తహశీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన చలివే ంద్రం

కొడంగల్,మే 19(ప్రభాతవార్త

వివిధ పనుల నిమిత్తం తహశీల్దార్ కార్యాలయానికి వచ్చే ప్రజల దాహర్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు డిప్యూటీ తహశీల్దార్ సురేష్ అన్నారు.శుక్రవారం స్దానిక తహశీల్దార్ కార్యాలయంలో రెవెన్యూశాఖ అద్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంబించారు.ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతు వేసవి కాలం ఎండలు తీవ్రంగా మండిపోతుండడంతో కార్యాలయానికి వచ్చే ప్రజలకు దాహర్తిని తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.వేసవికాలం ముగిసే వరకు చలివేంద్రం కొనసాగుతుందన్నారు. కార్యాలయానికి వచ్చే ప్రజలు చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.కార్యక్రమంలో ఆర్ఐ రాఘవేందర్‌తో పాటు రెవెన్యూ సిబ్బంది,వీఆర్‌ఏలు తదితరులు పాల్గొన్నారు.

## ఇడబ్ల్యూఎస్‌కాలనీ స్థలాలు క్రమబద్దీకరణ చేయాలని వినతి



మంత్రి మల్లారెడ్డికి వినతిపత్ర ం అందజేసు_న్న మున్సిపల్ చైర్‌పర్సన్ పావని జంగయ్యయాదవ్, వైస్‌చైర్మన్ మాధవరెడ్డి

ఘట్‌కేసర్, మే 19, ప్రభాతవార్త:

ఘట్‌కేసర్ మున్సిపల్ ఇడబ్ల్యూఎస్‌కాలనీలోని సర్వేనంబర్ 132లోని ఇళ్లస్థలాలను జిఓ.59 కింద క్రమబద్దీకరణ చేయాలని కోరుతూ శుక్రవారం ఘట్‌కేసర్ మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యయాదవ్, వైస్‌చైర్మన్ పలుగుల మాధవరెడ్డి, కాలనీవాసులు రాష్ట్ర కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. 1976-77 సంవత్సరంలో ఘట్‌కేసర్ సర్వేనంబర్ 132లోని 18-23 ఎకరాల ప్రభుత్వ భూమిలో పేదలకు పట్టాలు ఇవ్వగా ఏపీ గృహనిర్మాణ మండలి ద్వారా ఇళ్లు నిర్మించుకొని నివాసం ఉంటున్నారని తెలిపారు. జిఓ.59 ద్వారా 120 గజాల స్థలాలు కల్గిన వారికి క్రమబద్ధీకరణ చేసి పట్టాలు ఇవ్వాలని వారు మంత్రికి విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన మంత్రి మల్లారెడ్డి జిల్లా కలెక్టర్‌కు పోన్ చేసి క్రమబద్దీకరణ చర్యలు తీసుకొని మున్సిపాలిటీలో పేరు మార్పిడి జరిగేలా చూడాలని సూచించినట్లు తెలిపారు. అనంతరం మల్కాజ్‌గిరి పార్లమెంట్ ఇంచార్జ్ మర్రి రాజశేఖర్‌రెడ్డిని కలిసి క్రమబద్దీకరణపై చర్చించారు. ఈకార్యక్రమంలో ఇడబ్ల్యూఎస్‌కాలనీ అభివృద్ధి సంఘం అధ్యక్షులు కేశవపట్నం అంజనేయులు, కౌన్సిలర్ కడుపొల్ల మల్లేశ్, ఎంఆర్‌పిఎస్ నేత మీసాల మల్లేశ్, మాజీ వార్డుసభ్యులు బర్ల దేవేందర్, ఇడబ్ల్యూఎస్‌కాలనీ అభివృద్ధి సంఘ ం ప్రధానకార్యదర్శి శశిధరణ్, కీసరగుట్ట మాజీ డైరక్టర్ మెరుగు నరేశ్‌గౌడ్, నాయకులు అంకం సురేశ్‌యాదవ్, నాగరాజుగౌడ్, ఎండి.నజీర్, మున్న, నగేశ్ పాల్గొన్నారు.

# మహేశ్వరం నియోజకవర్గ మందిరాల అభివృద్ధికి రూ. 3 కోట్ల నిధులు

**- మంత్రి సబితా ఇంద్రారెడ్డి చొరవతో కొనసాగుతున్న నిధుల వరద**
**- సంతోషం వ్యక్తం చేస్తున్న భక్తులు, ప్రజలు**
**-సిఎంకు కృతజ్ఞతలు తెలిపిన మంత్రి**

రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, హైదరాబాద్, మే 19, (ప్రభాతవార్త) :

మహేశ్వరం నియోజకవర్గ అతి పురాతనమైన ఆలయాలకు మహార్ధశ పట్టనుంది. ఇప్పటికే నియోజకవర్గ కేంద్రంలోని శివగంగా దేవాలయం, తుక్కుగూడ మున్సిపాలిటీ ఫాబ్ సిటీ శ్రీ వెంకటేశ్వర ఆలయం, ఆర్కె పురం డివిజన్ లోని ఖిలా మైసమ్మ దేవాలయానికి, బాలాపూర్‌లో గల వేణుగోపాలస్వామి మందిరానికి జిల్లెలగూడ శ్రీ వెంకటేశ్వర స్వామి, గుడులకు కోటి రూపాయల చొప్పున మంజూరు అయిన విషయం తెలిసిందే. ఆయా దేవాలయాలలో మౌళిక సదుపాయల కల్పనకు భక్తుల సౌకర్యాలకు ఈ నిధులు వినియోగించనున్నారు. తాజాగా మహేశ్వరం మండలం జిన్నాయిగుట్ట శ్రీ లక్ష్మీ నర్సింహ్మాస్వామి దేవాలయానికి కోటి రూపాయలు, గట్‌పల్లి శ్రీ వీరాంజనేయ స్వామి మందిరానికి కోటి రూపాయలు, ఉప్పగడ్డ తాండ శ్రీ సేవాలాల్ మహారాజ్ గుడికి కోటి రూపాయల చొప్పున నిధులు విడుదల అయ్యాయి. ఈ సందర్భంగా మంత్రి సబితాఇంద్రారెడ్డి మాట్లాడుతూ... రాష్ట్రంలోని అన్ని దేవాలయాల్లో దూప, దీప, నైవేద్యాలు జరిగేలా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. దేశంలోనే ఎక్కడా లేనివిధంగా యాదాద్రి టెంపుల్‌ను పునర్నిర్మాణం చేసి భక్తులకు అందుబాటులోకి తెచ్చిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కు దక్కుతందని అన్నారు. నియోకవర్గంలోని అతి పురాతనమైన దేవాలయాల అభివృద్ధికి కోరిన వెంటనే నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి కేసీఆర్ నియోజకవర్గంలోని 8 ప్రాచీన దేవాలయాల్లో కోట్ల రూపాయల నిధులతో మౌళిక సదుపాయాల కల్పన, ఇతర పనులు చేపట్టనున్నట్లు మంత్రి తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాన రాష్ట్రంలో అన్ని మతాలకు, కులాలకు సమాన ప్రాధాన్యత ఇస్తూ అభివృద్ధి చేస్తున్నారని అన్నారు..

# పారిశుధ్యం మెరుగుపరిచేందుకు సహకరించాలి



ఘట్‌కేసర్ మున్సిపల్ ప్రత్యేక పారిశుద్య సమావేశంలో మాట్లాడుతున్న కమీషనర్ వేమనరెడ్డి, పాల్గొన్న చైర్‌పర్సన్ పావనియాదవ్

ఘట్‌కేసర్, మే 19, ప్రభాతవార్త:

పట్టణంలో పారిశుద్య నిర్మూలనకు అందరూ సహకరించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యాయాదవ్ అన్నారు. ఘట్‌కేసర్ మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం చైర్‌పర్సన్ ముల్లి పావని యాదవ్ అధ్యక్షతన ప్రత్యేక పారిశుద్య డ్రైవ్ సమావేశం జరిగింది. ఈసందర్భంగా కమీషనర్ పి.వేమనరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మున్సిపల్ పరిధిలో చేపట్టవలసిన పారిశుద్య కార్యక్రమాలను తెలియజేశారు. చైర్‌పర్సన్ పావనియాదవ్ మాట్లాడుతూ ప్రతివార్డులో డ్రైనేజీ శుభ్రంగా ఉండేవిధంగా చూడాలన్నారు. ప్రతిఇంటికి చెత్త సేకరణ చేసే సమయంలో తడి, పొడి చెత్తలను వేరు చేసి చెత్త సేకరణ వాహనంలో డంపింగ్ యార్డుకు తరలించాలని పేర్కొన్నారు. రోడ్లకు ఇరువైపులా ఉన్న పిచ్చిమొక్కలను, ముళ్ల పొదలను తొలగించాలని, శిథిలావస్థలో ఉన్న భవనాలను కూల్చివేసేందుకు యాజమానులకు నోటీసులు జారీ చేయాలని తెలిపారు. నివాస గృహాలలో ఉత్పత్తి అయ్యే వ్యర్థాలను రోడ్డుపై ఉన్న భవన వ్యర్థాలను నిర్మాణ సామాగ్రిని తొలగించాలన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి శానిటేషన్ ప్రత్యేక డ్రైవ్‌ను పూర్తి చేయాలన్నారు. ఈసమావేశంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ పలుగుల మాధవరెడ్డి, కౌన్సిలర్లు కొమ్మగోని రమాదేవి, బొక్క సంగీత, కొమ్మిడి అనురాధ, సల్లూరి నాగజ్యోతి, కడుపొల్ల మల్లేశ్, షేక్‌జహంగీర్, కుతాడి రవీందర్, కోఆప్షన్‌సభ్యులు బొక్క సురేందర్‌రెడ్డి, మేనేజర్ మర్రి అంజిరెడ్డి, వర్క్ ఇన్‌స్పెక్టర్ గణేశ్, స్వచ్ఛసర్వేక్షన్ ఇంచార్జ్ యోగేశ్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు ఎలాంటి సమస్యలు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలి

**-అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ**

ప్రభాతవార్త వికారాబాద్ జిల్లా ప్రతినిధి :

జిల్లాకు కేటాయించిన అన్ని కొనుగోలు కేంద్రాలను రేపటి వరకు ప్రారంభించి రైతులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ సంబంధిత అధికారులకు సూచించారు.శుక్రవారం టెలికాన్ఫరెన్స్ ద్వారా వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ఏర్పాట్లు,సేకరించిన ధాన్యాన్ని వెంటనే తరలించే ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...జిల్లాలో ఇప్పటికే కొనుగోలు కేంద్రాల ద్వారా వరి ధాన్యం సేకరించడం జరుగుతుందని,మిగిలి ఉన్న మరికొన్ని కేంద్రాలను రేపట్టి వరకు ప్రారంభించి రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ధాన్యాన్ని సేకరించాలన్నారు.రైతులు కూడా నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలను తీసుకొచ్చినట్లయితే ధాన్యం సేకరణలో సమస్యలు ఉండవని తెలిపారు.కొనుగోలు కేంద్రాల వద్ద ప్యాడి క్లీనర్లు,గోనే సంచులు, టార్ఫలిన్‌లు అందుబాటులో ఉంచాలన్నారు,సేకరించిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలని అన్నారు.ప్రతి రోజు సంబంధిత అధికారులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి సమస్యలు ఉంటే అప్పటికప్పుడే పరిష్కరించుకోవాలని సూచించారు.ఈ సమావేవంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి రాజేశ్వర్,డిఆర్‌డిఓ కృష్ణన్,పౌరసరఫరాల జిల్లా మేనేజర్ విమల,వ్యవసాయ శాఖ అధికారి గోపాల్,జిల్లా మార్కెటింగ్ అధికారి సారంగపాణి,రైస్ మిల్లర్లు,ట్రాన్స్‌పోర్టర్‌లు, తదితరులు పాల్గొన్నారు.

# పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి

**- అదనపు కలెక్టర్ ఎస్.తిరుపతిరావు**

రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, హైదరాబాద్, మే 19, (ప్రభాతవార్త) :

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమీషన్ ద్వారా ఈనెల 21, 22వ తేదీల్లో జగరనున్న సీబీఆర్టీట (ఏఈఈ) రాత పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ ఎస్.తిరుపతిరావు తెలిపారు. ఈనెల 21,22వ తేదీల్లో మొత్తం 13 సెంటర్లలో నిర్వహించనున్న అసిస్టెంట్ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ పోస్టులకు 21 రోజు 3948 మంది, 22వ రోజు 4086 మంది అభ్యర్థులు హాజరు కానున్నట్లు తెలిపారు.. ఉదయం 10 గంటల నుంచి 12.30 వరకు అలాగే మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు. పరీక్ష సమయానికి అర్థగంట ముందుగా పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని, ఆలస్యంగా వచ్చే వారిని లోనికి అనుమతించబడరని తెలిపారు. పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించుటకు పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. పరీక్షా కేంద్రాల సమీపంలో ఉన్నటువంటి జిరాక్స్ కేంద్రాలను మూసివేయించాలని చెప్పారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాం కలగకుండా నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని విద్యుత్ అధికారులకు సూచించారు.

పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు, అలాగే ఇన్విజిలేటర్లు విధులు నిర్వహించే సిబ్బంది ఎవ్వరూ పరీక్షా కేంద్రాల్లోకి సెల్ ఫోన్లు క్యాలిక్యూలేటర్ వంటి ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతి లేదని చెప్పారు.

## మంచిరెడ్డి కిషన్‌రెడ్డికి మాతృ వియోగం



అంత్యక్రియల్లో పాల్గొన్న మంత్రి సబితారెడ్డి

ఇబ్రహింపట్నం, మే 19,(ప్రభాతవార్త):

రంగారెడ్డి జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి తల్లి మంచిరెడ్డి పద్మమ్మ (92) మృతి చెందారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రులు కేటీఆర్, హరీష్‌రావు తదితరులు సంతాపం తెలిపారు. శుక్రవారం ఎలిమినేడులో అంత్యక్రియలు చేశారు. అంత్యక్రియల్లో మంత్రి సబితారెడ్డితో పాటు పలువురు ప్రముఖులు హాజరైయారు. ఎమ్మెల్యేలు జైపాల్‌యాదవ్, కాలె యాదయ్య, అంజయ్యయాదవ్, అమ్మెల్సీలు కసిరెడ్డి నారాయణరెడ్డి, మల్లెశం, జడ్పి చైర్మన్ అనితారెడ్డి, మేడ్చల్ జడ్పి చైర్మన్ మెలిపెద్ది శరత్ చంద్రారెడ్డి, అడిషనల్ డిజిపి బత్తుల శివధర్‌రెడ్డి, రాచకొండ సిపి డిఎస్ చౌహాన్, డిసిపిలు సిహెచ్ శ్రీనివాస్, సాయిశ్రీ, మాజి ఎమ్మెల్యేలు కోదండరెడ్డి, సుధార్‌రెడ్డి, కోదండరెడ్డి, లక్ష్మారెడ్డి, రెడ్కో చైర్మన్ సతీష్‌రెడ్డి, డిసిసిబి చైర్మన్ మనోహార్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు వెంకటరమణరెడ్డి, డిసిఎంఎస్ చైర్మన్ కృష్టారెడ్డి, వైస్ చైర్మన్ సత్యయ్య, క్యామ మల్లెష్, రైతుబంధు చైర్మన్ వంగేటి లక్ష్మారెడ్డి, బీఆర్ఎస్, సిపిఎం, కాంగ్రెస్, బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా శోభాయాత్ర..సిఐ, ఎస్ఐలకు సన్మానం

ఘట్‌కేసర్, మే 19, ప్రభాతవార్త:

ఘట్‌కేసర్‌లో హనుమాన్ శోభాయాత్ర ప్రశాంతంగా ముగియడంతో నిర్వహకులు పోలీసు అధికారులకు సన్మానం చేశారు. ఈనెల 14న హనుమాన్ జయంతి సందర్భంగా భజరంగ్‌దళ్ సేవా సంస్థ ఆధ్వర్యంలో ఘట్‌కేసర్ పట్టణంలో హనుమాన్ శోభాయాత్ర నిర్వహించగా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేసి ఏలాంటి అవాంఛనాయ సంఘటనలు జరుగకుండా భద్రతా చర్యలు తీసుకున్నారు. ఈసందర్భంగా శుక్రవారం భజరంగ్‌దళ్ సేవా సంస్థ వ్యవస్థాపకులు పసులాది చంద్రశేఖర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్ వి.అశోక్‌రెడ్డి, ఎస్ఐ అశోక్‌తేజలను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సన్మానించి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈకార్యక్రమంలో సంస్థ సభ్యులు గణేశ్‌గౌడ్, విజయ్, శ్రీనివాస్‌చారి, రిశివరన్ తదితరులు పాల్గొన్నారు.





ఘట్‌కేసర్ సీఐ అశోక్‌రెడ్డి, ఎస్ఐ అశోక్‌లను సన్మానిస్తున్న భజరంగ్‌దళ్ సేవాసంస్థ వ్యవస్థాపకులు చంద్రశేఖర్

## నందిగామ నూజీవీడు సీడ్స్‌లో ఆకస్మిక తనిఖీలు

**-నాణ్యత ప్రమాణాలు పాటించాలని హెచ్చరిక**



నందిగామ మే19,ప్రభాతవార్త :

విత్తనాల తయారిలో నాణ్యత ప్రమాణాలను పాటించకుంటే చర్యలు తప్పవని నందిగామ మండల వ్యవసాయాధికారి గోపాల్ నాయక్ అన్నారు. శుక్రవారం నందిగామ మండల కేంద్రం పరిధిలోని నూజీవీడు సీడ్స్ పరిశ్రమలో పోలీస్ శాఖ,వ్యవసాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా వ్యవసాయాధికారి గోపాల్ నాయక్ మాట్లాడుతూ..రైతు సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని ,నకిలీ విత్తనాలు తయారు చేస్తూ రైతులను ఆగం చేసే విత్తనాల పరిశ్రమలపై తనిఖీలను ముమ్మరం చేసిందన్నారు.తక్కువ నాణ్యత గల విత్తనాలను,నకిలీ విత్తనాలను ఉపయోగించవద్దన్నారు.ఈ సందర్భంగా బిటీకాటన్ ,మొక్కజోన్న తదితర విత్తనాల ప్రాసెసింగ్ యూనిట్లను తనిఖీ చేశారు.పరిశ్రమలో తనిఖీ చేసిన విత్తనాలను ల్యాబ్‌కు పంపించినట్లు వ్యవసాయాధికారి తెలిపారు.ఈ తనిఖీలో నందిగామ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ రామయ్య,నూజీవీడు ప్లాంట్ మేనేజన్ జి.రాము,మార్కెటింగ్ కెఎం మూర్తి,బాజీ,తదితరులు పాల్గొన్నారు.

## విఆర్‌ఏల సర్వీసు క్రమబద్ధీకరణపై హర్షం

ఘట్‌కేసర్, మే 19, ప్రభాతవార్త:

విఆర్‌ఏల సర్వీస్‌ను క్రమబద్ధీకరణ చేయాలని ప్రభుత్వం నిర్ణ్ణయించడంతో వారు హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు ఘట్‌కేసర్ తహసీల్ కార్యాలయం వద్ద సీఎం కేసీఆర్ ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు. విఆర్‌ఏల అసోసియేషన్ అధ్యక్షులు క్రిష్ణ ఆధ్వర్యంలో ప్రభుత్వం నిర్ణయంపై హర్షం వ్యక్తం చేస్తూ సీఎంకు క్షీరాభిషేకం చేశారు. తమ సర్వీస్‌ను క్రమబద్దీకరణ చేసినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు వారు తెలిపారు. విఆర్‌ఏలను రెవెన్యూ శాఖలోనే కొనసాగించాలని, పేస్కేల్, వారసత్వ ఉద్యోగాల కల్పన, పదోన్నతులపై సర్కార్ నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో విఆర్‌ఏలు కుమార్, కలీమ్, లక్ష్మయ్య, రాజు, ప్రభాకర్, క్రిష్ణ, మైసయ్య, బిక్షపతి, సత్యనారాయణ, విజయలక్ష్మి, వంశీ తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలుపై రైతులు నిరసన

**-ఎంపిపి అధికారులతో సమావేశం**

ఘట్‌కేసర్, మే 19, ప్రభాతవార్త:

ధాన్యం కొనుగోలు చేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పలువురు రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఘట్‌కేసర్ మండల పరిషత్ కార్యాలయంలోని మహత్మాగాంధీ విగ్రహం ఆవరణలో శుక్రవారం ధాన్యం బస్తాతో నిరసన వ్యక్తం చేశారు. వరికోసి దాదాపు నెలరోజులు అవుతున్నా ధాన్యం కల్లాలలో ఉందని తేమ శాతం, ఇతర పరీక్షలు అంటూ సేకరణ చేయకుండా అధికారులు జాప్యం చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దిగుమతి చేసుకున్న వరిధాన్యం ఇప్పటి వరకు 20 శాతం కూడా కొనుగోలు చేయలేదని వర్షం వస్తే ధాన్యం తడిసిపోయే ప్రమాదం ఉందని, ఎన్నో వ్యయ ప్రయాసలకు ఒర్చుకొని పంటలు పండిస్తే తగిన గిట్టుబాటు ధర కూడా రావడం లేదని వాపోయారు. రైతులు ఎంపిపి సుదర్శన్‌రెడ్డిని కలిసి సమస్య తెలియజేయగా ఆయన వ్యవసాయాధికారులతో సమావేశం నిర్వహించి సమస్యపై చర్చించారు. ముఖ్యమంత్రి హామీలను అధికారులు పట్టించుకోవడం లేదని, రైలస్ మిల్లర్లతో కుమ్మక్కయ్యారనే ఆరోపణలు వస్తున్నాయని పేర్కొన్నారు. మండలంలో 1,700 ఎకరాల్లో వర్షాలకు పంట నష్టం జరిగినా ఇప్పటివరకు రైతులకు నష్ట పరిహారం అందలేదని ఎంపిపి అసం తృప్తి వ్యక్తం చేశారు. మంత్రి మల్లారెడ్డి ఆర్భాటంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను విస్మరించారని ఆరోపించారు.

## రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి అధికారంలోకి రావడం ఖాయం



హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ ఆధ్వర్యంలో బిజేపి పార్టీలో చేరుతున్న బిఆర్ఎస్,కాంగ్రెస్ నాయకులు

కీసర,మే19,ప్రభాతవార్తః

రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని హుజురాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ ధీమా వ్యక్తం చేశారు.శుక్రవారం మండలంలోని కరీంగూడ గ్రామం నుండి బిఆర్ఎస్,కాంగ్రెస్ పార్టీల నుండి భారీగా బిజేపి పార్టీలో ఎమ్మెల్యే ఈటల రాజేందర్ ఆద్వర్యంలో చేరారు.ఈ సందర్బంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి పార్టీ అధికారంలోకి రావడానికి ప్రతి కార్యకర్త పనిచేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో మేడ్చల్ రూరల్ జిల్లా అద్యక్షులు పట్లోళ్ల విక్రంరెడ్డి,జిల్లా ప్రధాన కార్యదర్శి జిల్లాల తిరుమల్‌రెడ్డి,మండల అధ్యక్షులు దేశం మల్లేష్‌గౌడ్, బోగారం ఎంపిటిసి సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి,బిజేపి కిసాన్ మోర్చ జిల్లా ప్రధాన కార్యదర్శి కొలిచెలిమి క్రిష్ణ,మండల ప్రధాన కార్యదర్శి కోల బాలరాజు యాదవ్,నాయకులు సతీష్,రాజు తదితరులు పాల్గొన్నారు.

## కూలీల సంఖ్య పెంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపిఓ ప్రవల్లిక

జిల్లెడు చౌదరిగూడ, మే 19,(ప్రభాతవార్త):

గ్రామాల్లో ఉపాధి హామీ కూలీల సంఖ్య పెంచాలని ఏపిఓ ప్రవల్లిక అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయంలో ఏర్పటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామ స్థాయిలో ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్లు ప్రతి రోజు కూలీలకు సంబందించిన వివరాలను ఆన్‌లైన్‌లో పంపాలని అన్నారు. అలాగె కూలీలకు ప్రతి రోజు కొలతల ప్రకారం పనులు చేయించాలని అన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పనులు చేయాలని ఆమె పెర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్‌లు వినోద్‌కుమార్, లక్ష్మారెడ్డి, దేవోజి, ఫీల్డ్ అసిస్టెంట్లు అంజనేయులు, ఉమావతి, రాషోద్దిన్, లక్ష్మయ్య గౌడ్, హన్మంత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## ఘనంగా మాసశివరాత్రి ప్రత్యేక పూజలు



శామీర్‌పేటలోని శివాలయంలో మాసశివరాత్రిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు పాల్గొన్న భక్తుల దృశ్యం

శామీర్‌పేట, మే 19, ప్రభాతవార్త

శామీర్‌పేటలోని శ్రీభవాని రామలింగేశ్వరస్వామి ఆలయం (శివాలయం)లో మాసశివరాత్రిను పురస్కరించుకుని ప్రత్యేక పూజలు ఘనంగ నిర్వహించారు. శామీర్‌పేట శివాలయంలో ప్రధాన అర్చకులు గడియారం మురళీధర్‌శర్మ ఆధ్వర్యంలో వేదపండితుల మంత్రోచ్చరణ మద్య స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రుద్రాభిషేకం, మంత్రపుష్పం, అర్చన తదితర పూజా కార్యక్రమాలు కన్నుల పండుగగా జరిగాయి. తీర్థ ప్రసాద వితరణ చేశారు. తూంకుంటకు చెందిన భజన బృందం భక్తి గీతాలు ఆలపించారు. భక్తుల సహకారంతో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## మూడుచింతలపల్లి మండలంలో పర్యటించిన జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ ఆగస్త్య



కొల్తూర్ గ్రామాన్ని సందర్శించిన జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ ఆగస్త్య, పాల్గొన్న జిల్లా స్థాయి అధికారుల దృశ్యం

శామీర్‌పేట, మే 19, ప్రభాతవార్త

మూడుచింతలపల్లి మండలంలోని వివిధ గ్రామాల్లో మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ ఆగస్త్య పర్యటించారు. ఆయనతో పాటు జిల్లా స్థాయి అధికారుల బృందం కూడ పర్యటించింది. శుక్రవారం మూడుచింతలపల్లి మండలంలోని కొల్తూర్, అనంతారం, లక్ష్మాపూర్ గ్రామాల్లో జిల్లా అదనపు కలెక్టర్, జిల్లా అధికారుల బృందం పర్యటించింది. ప్రత్యేక పారిశుద్యం కార్యక్రమంలో భాగంగ మూడుచింతలపల్లి మండలంలోని ఆయా గ్రామాలను వారు పర్యటించి పారిశుద్యం, పరిశుభ్రత పనులను పరిశీలించారు. గ్రామాల్లో రోడ్లు, మురికికాలువలు, ప్రకృతివనాలు, డంపింగ్‌యార్డులు, శ్మశానవాటికలు, నర్సరీలను సందర్శించి పరిశీలించారు. గ్రామంలో మరుగుదొడ్ల వాడకం గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ ఆగస్త్యతో పాటు జిల్లా స్థాయి అధికారులు జడ్పీ సిఇఓ దేవసహాయం, డిఆర్‌డిఓ పద్మజారాణి, ఎంపిడిఓ వత్సలదేవి, ఎంపిఓ సునిత, ఆయా గ్రామాల సర్పంచులు ఎన్.శిల్పయాదగిరి, నర్సింహ్మారెడ్డి, సింగం అంజనేయులు, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

## ఏయూలో ఐసీఐసీఎస్‌డీ పోస్టర్ ఆవిష్కరణ

ఘట్‌కేసర్, మే 19, ప్రభాతవార్త:

ఘట్‌కేసర్ మండలం వెంకటాపూర్‌లోని అనురాగ్ విశ్వవిద్యాలయంలో శుక్రవారం ఇంటెలిజెంట్ కంప్యూటింగ్ ఫర్ సస్టెయినబుల్ డవలప్‌మెంట్ (ఐసీఐసీఎస్‌డీ) పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆగష్టు 25, 26 తేదీలలో హైదరాబాద్‌లోని అనురాగ్ విశ్వవిద్యాలయంలో స్పింగర్ పబ్లికేషన్స్ సహకారంతో ఐసీఐసీఎస్‌డి అంతర్జాతీయ సదస్సు జరుగుతుందని ఈసదస్సుకి అమెరికా, ఇంగ్లాండ్, ఇటలీ దేశాల నుంచి ముఖ్య వక్తలు విచ్చేయనున్నారని తెలిపారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఏయూ ఉపకులపతి రామచంద్రం, సీఈఓ నీలిమ, సదస్సు చైర్ సతీష్‌కుమరన్, ఆర్‌అండ్‌డి డీన్, ఈసీఈ, ఈఈఈ విభాగాల అధ్యాపకులు పాల్గొన్నారు. అంతర్జాతీయ సదస్సు విజయవంతం చేసేందుకు అవసరమైన సన్నాహాలు చేయాలని నిర్ణ్ణయించినట్లు తెలిపారు.